సమాచారం

ఈనెల 29 నుంచి గీతా సమ్మర్ క్యాంపు

ఆల్విన్‌కాలనీ: అంతర్జాతీయ ఇస్కాన్ సంస్థ కూకట్‌పల్లి శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు గీతా సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ మహా శృంగ దాస్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. డీఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 29వ తేదీ నంచి మే 10వ తేదీ వరకు గీతా సమ్మర్ క్యాంప్ కొనసాగుతుందని పేర్కొన్నారు. భగవద్గీత పారాయణం ఉపోద్ఘాతం, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, సింగింగ్, స్కేటింగ్, స్విమ్మింగ్, గేమ్స్, డ్రామా, దేశభక్తి కథలు, శ్లోకాల్లో తర్ఫీదు ఇవ్వనున్నారు. ప్రతి రోజు ఉదయం, మధ్యాహ్నం టిఫిన్, భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నం.94404 86792.

మే 1 నుంచి మ్యూజిక్ సమ్మర్ క్యాంపు

ఆల్విన్‌కాలనీ: సాధన మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నారు. మే 1 నుంచి 30వ తేదీ వరకు సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు డ్యాన్స్, వోకల్, కీబోర్డు, డ్రమ్స్‌పై రెగ్యులర్ తరగతులు ఉంటాయని తెలిపారు. మాధవరం కాలనీ, ఎస్‌వీఎస్ చాంపియన్స్ కిడ్స్ స్కూల్‌లో తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పత్రాలు చూపించి వాహనాలను తీసుకెళ్లండి

కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్ కృష్ణ మోహన్

మూసాపేట: కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న వాహనాలకు ఒరిజినల్ పత్రాలు చూపించి.. తమ వాహనాలను తీసుకెళ్లాలని కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపారు. కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో గుర్తు తెలియని బైక్‌లు 22 ఉన్నాయని పేర్కొన్నారు. ఇప్పటికే సంబంధిత వాహన యమానులకు రెండుసార్లు పోస్ట్ ఆఫీస్ ద్వారా నోటీసులు పంపామని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత వాహనదారులు తమ వాహనానికి సంబంధించిన ఒరిజినల్ పత్రాలు స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు చూపించి తమ వాహనాలను తీసుకెళ్లాలని కోరారు. లేకపోతే త్వరలో వాహనాలను వేలం వేస్తామన్నారు.

ఆకట్టుకున్న ఆభరణాలు

సాక్షి, సిటీబ్యూరో: బంజారాహిల్స్‌లోని తనిష్క్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్లామ్ గోల్డ్ కలెక్షన్ ప్రదర్శణలో టాప్ మోడల్స్ బంగారు ఆభరణాలతో అలరించారు. నిత్య జీవనంలో భాగంగా ఆభరణాలతో ఎలా అలంకరించుకుంటారనే అంశాలను ప్రదర్శిస్తూ అందాల ముద్దుగుమ్మలు ఆకట్టుకున్నారు. ఈ స్టైలిస్ట్ ఈవెంట్‌లో మోడల్స్‌తో పాటు పలువురు ఫ్యాషన్ ఔత్సాహికులు పాల్గొన్నారు.

మట్టిలో మాణిక్యాలు

- సత్తాచాటిన ప్రభుత్వ కళాశాల విద్యార్థులు
- ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు
- కార్పొరేట్ కళాశాలలకు దీటుగా రాణించిన విద్యార్థులు

మూసాపేట: కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఫలితాల్లో విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారు. పేద కుటుంబంలో జన్మించిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివి కార్పొరేటర్ కళావాలలకు దీటుగా మార్కులు సాధించారు. తల్లి, తండ్రి ఎవరో ఒకరే ఉండటం, కూలి పని, టైలరింగ్, పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్న పిల్లలు కళాశాల టాపర్లుగా నిలిచారు. మట్టిలో మాణిక్యాలుగా అత్యుత్తమ మార్కులు సాధించారని పలువురు అభినందిస్తున్నారు.

- ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 556 మంది పరీక్షలకు హాజరయ్యారు. వారిలో 301 మంది ఉత్తీర్ణులు కాగా 255 మంది విద్యార్థులు ఫెయిలయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 480 మంది పరీక్షకు హాజరయ్యారని వీరిలో 318 మంది ఉత్తీర్ణులు కాగా 161 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ రూపాలక్ష్మి తెలిపారు.
- మొదటి సంవత్సరంలో సీజీఏ గ్రూపులో గౌసియా బేగం 486 మార్కులు, సీజీఏ గ్రూపులో రిషికుమార్ 484 మార్కులు, ఏఅండ్‌టీ గ్రూపులో రవి 483 మార్కులు, బైపీసీలో 459 మార్కులు, సయ్యద్ సమీర్ ఎంపీసీలో 460 మార్కులు, భువనశ్రీ సీఈసీలో 480మార్కులు, సౌజన్యశ్రీ సీఈసీలో 470మార్కులు సాధించారు.
- ద్వితీయ సంవత్సరంలో ఓంకార్ అప్పా సీజీఏ గ్రూపులో 981 మార్కులు, పీఎస్‌టీటీ గ్రూపులో రమ్య 975 మార్కులు, కామిని కుమారి సీజీఏ గ్రూపులో 962 మార్కులు, ఎంపీసీ గ్రూపులో లిఖిత రావు 947 మార్కులు, ఉన్నిస బైపీసీ గ్రూపులో 938 మార్కులు, సుమిత్ర ఎంఈసీ గ్రూపులో 934 మార్కులు, మీనాజ్ బేగం సీఈసీ గ్రూపులో 934 మార్కులు సాధించారు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవుతా..



మేము మూసాపేట హబీబ్‌నగర్‌లో ఉంటాం. నాన్న లేబర్ పని చేసి మమ్మల్ని పోషించి చదివించారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయి అమ్మానాన్నను మంచిగా చూసుకోవాలనేది నా కోరిక.
– గౌసియా బేగం, సీజీఏ ఫస్ట్ ఇయర్

అమ్మను మంచిగా చూసుకుంటా..



కూకట్‌పల్లి ఎల్లమ్మబండలో ఉంటాం. డాడీ చనిపోయాడు. అమ్మ చదివిస్తోంది. మంచిగా చదువుకొని సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసి అమ్మను మంచిగా చూసుకుంటాను.
– రిషి కుమార్, సీజీఏ ఫస్ట్ ఇయర్

నాన్న కష్టాలను తీరుస్తా..



మేము సూరారం రాజీవ్ గృహకల్పలో ఉంటాం. నాన్న పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేసి మమ్మల్ని చదివిస్తున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసి నాన్న కష్టాలను తీరుస్తా.
– బిందుప్రియ, ఎంపీసీ ఫస్ట్ ఇయర్

మంచి ఉద్యోగం సంపాదించాలి



నాన్న ప్రైవేట్ జాబ్ చేస్తున్నారు. అమ్మ ఇంట్లోనే ఉంటుంది. వాళ్లు కష్టపడి చదివిస్తున్నారు. ఖైరతాబాద్ నుంచి కూకట్‌పల్లి కళాశాలకు వెళ్లి చదువుకుంటున్నాను. గ్రాఫిక్స్, ఫైన్ ఆర్ట్స్‌లో మంచి ఉద్యోగం సంపాదించాలి.
– ఓంకార్ అప్పా, సీజీఏ సెకండియర్

ఇంట్లో వాళ్లని మంచిగా చూసుకుంటా..



మూసాపేట, భరత్ నగర్‌లో ఉంటాం. అమ్మ, నాన్న ఇద్దరు టైలరింగ్ చేసి మమ్మల్ని చదివిస్తున్నారు. మంచిగా చదువుకుని మంచి జాబ్ చేస్తాను. అమ్మా నాన్నను మంచిగా చూసుకోవడమే నా లక్ష్యం.
– రమ్య, పీఎస్‌టీటీ సెకండియర్

పాపిరెడ్డి కాలనీలో బీజేపీ ప్రచారం



ప్రచారంలో అభివాదం చేస్తున్న రవికుమార్‌యాదవ్

శేరిలింగంపల్లి: ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీకి ప్రజలంతా అండగా నిలిచి, బీజేపీకి ఓటు వేయాలని ఆ పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఎం.రవి కుమార్‌యాదవ్ కోరారు. శేరిలింగంపల్లి పాపిరెడ్డి కాలనీ, రాజీవ్ గృహకల్ప, ఆరంభ టౌన్‌షిప్, సందయ్యనగర్, సురభికాలనీలలో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా బుధవారం సాయంత్రం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ దేశంలో మోదీ ప్రభంజనం కొనసాగుతుందని, ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కె.ఎల్లేష్, రాజు శెట్టి, రమేష్, నర్సింహ, శ్రీనివాస్, జయలక్ష్మీ, గణేష్, నర్సింగ్‌యాదవ్, నీలకంఠరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొండాపూర్ సబ్‌స్టేషన్‌లో 8ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్



గచ్చిబౌలి: వేసవి భారం, ఓవర్ లోడ్ నివారించేందుకు కొండాపూర్ సబ్‌స్టేషన్‌లో అదనంగా 8 ఎంవీఏ ట్రాన్స్ ఫార్మర్‌ను ప్రారంభించారు. దీంతో కొండాపూర్, అయ్యప్పసొసైటీ, సెజ్ సబ్ స్టేషన్ల పరిధిలో వెసులుబాటు కల్గింది. నాణ్యమైన, నిరంతరాయమైన విద్యుత్ సరఫరాతో దాదాపు 45 వేల మంది విద్యుత్ వినియోగదారులు ప్రయోజనం పొందనున్నారు. కార్యక్రమంలో సైబర్‌సిటీ ఎస్ఈ వెంకన్న, కొండాపూర్ డీఈ గరుత్మంత రాజు, ఏడీఈ కమలాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బక్షికుంటను పరిశీలించిన గ్రేటర్ కమిషనర్



శేరిలింగంపల్లి: చందానగర్ సర్కిల్ పరిధిలోని బక్షికుంటను జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్, జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్‌లు బుధవారం పరిశీలించారు. సీఎస్ఆర్ నిధులతో బెంగుళూరుకు చెందిన మల్లిగ్‌వాడ ఫౌండేషన్ అభివృద్ధి చేసిన బక్షికుంటను జీహెచ్ఎంసీ, ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీసీ వంశీకృష్ణ, చీఫ్ ఇంజనీర్ ప్రాజెక్టు డివిజన్ దేవానంద్, ఈఈ రాజు తదితరులు పాల్గొన్నారు.

భెల్ భద్రతపై దృష్టి సారించండి



భెల్ యాజమాన్యం మూసివేసిన ఓ కాలనీ వద్ద గేటు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్ అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందనే ఆరోపణలున్నాయి. అనేక క్వార్టర్‌లు ఖాళీగా ఉండటంతోపాటు కాలనీ విస్తీర్ణం ఎక్కువగా ఉండటం అసాంఘిక శక్తులకు ఈ ప్రాంతం కలిసివస్తోంది. ఇతర ప్రాంతాలకు చెందిన వారు దర్జాగా భెల్ కాలనీకు వచ్చి మద్యం సేవించడంతో పాటు ఇతర పనులు చేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. పలు ప్రాంతాలు పోకిరీలకు అడ్డాగా మారాయి. భెల్‌కాలనీలో పోలీసు పెట్రోలింగ్ ఉండదు...దీంతో వారంతా ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో భెల్ కాలనీ భద్రత సీఐఎస్ఎఫ్ పర్యవేక్షించేది. ఆ సమయంలో బయట వ్యక్తులు కాలనీలోకి రావాలంటే భయపడే వారు. అయితే యాజమాన్యం వారిని తొలగించి బాధ్యతలను భెల్ సెక్యూరిటీకు అప్పజెప్పారు. వారంతా ఉద్యోగ విరమణ చేయడంతో హోంగార్డులకు అప్పజెప్పారు. వీరి పర్యవేక్షణ మాత్రం యాజమాన్యం చూసే విధంగా ఒప్పందం చేసుకున్నారు. ఆసమయంలో కాలనీలో దొంగతనాలు సైతం జరిగాయి. యాజమాన్యం కాలనీలో జరిగే అసాంఘిక కార్యక్రమాలను కట్టడి చేయకుండా భెల్ కాలనీను ఆనుకొని కాలనీలకు వెళ్లే గేట్‌లను మూయడం ప్రారంభించింది. సినిమా షూటింగ్‌ల కారణంగా బయట వ్యక్తులు కాలనీలోకి వస్తున్నారంటూ ఆదాయ వనరులైన సినిమా షూటింగ్‌ల అనుమతులను రద్దు చేశారు. ఇక రాత్రి సమయంలో భెల్ కాలనీలోని బహిరంగ ప్రదేశాలు, చెట్ల పొదల్లో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీనిని గమనించిన భెల్ యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించింది. రాత్రి సమయంలో పెట్రోలింగ్‌ను కట్టుదిట్టం చేసింది. ఇప్పటికైనా భెల్ యాజమాన్యం భద్రత పేరిట కాలనీ గేట్లు మూయడం కాకుండా కాలనీలో మరింత భద్రత వ్యవస్థను ఏర్పాటు చేసి అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

అన్ని వర్గాలను మోసం చేస్తున్న కాంగ్రెస్

మంద కృష్ణ మాదిగ

పంజగుట్ట: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రెడ్డి కుల తత్వం పెరిగి పాకాన పడిందని దాన్ని వెంటనే తొలగించకపోతే రాష్ట్రంలో భవిష్యత్‌లో కాంగ్రెస్ అడ్రస్ లేకుండా పోతుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి వల్ల కాంగ్రెస్ గెలవలేదని అందుకు ఉదాహరణ మల్కాజ్‌గిరి ఎంపీగా ఉన్న రేవంత్ ఆయన పార్లమెంట్ పరిధిలో ఏడు ఎమ్మెల్యే సీట్లల్లో ఒక్కటి కూడా గెలవలేదని, కేవలం కేసీఆర్ అహంకార పాలనకు వ్యతిరేకంగా ఓటువేస్తే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రకులంలో రెడ్డిలను మినహాయించి ఏ కులానికి కూడా ఐదు కీలక పదవులు ఇవ్వలేదన్నారు. అన్ని కీలక పదవుల్లో, నామినేటెడ్ పోస్టుల్లో రెడ్డిలకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌ను గెలిపించడంలో రెడ్డి కులస్తులకన్నా ముస్లింలే ప్రముఖపాత్ర పోషించారని అన్నారు.

నేడు బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

కూకట్‌పల్లి: హైదర్‌నగర్ డివిజన్ శ్రీరాంనగర్‌లో ఈనెల 25వ తేదీన బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు ఇంటింటి ప్రచారం చేయనున్నారు. చేవెళ్ల లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు మద్దతుగా ప్రచారం ఉంటుందని డివిజన్ కమిటీ పేర్కొంది. ఈ కార్యక్రమంలో నాయకులు, ఉద్యమకారులు కార్యకర్తలు, వార్డుమంబర్లు, ఏరియా కమిటీ మెంబర్లు, బస్తీ కమిటీ మెంబర్లు పాల్గొనాలని కోరింది.

వర్షపు నీటి కాలువలో మురుగు



రామచంద్రాపురం(సంగారెడ్డి): వర్షపు నీటి కాలువలో డ్రైనేజీ నీరు చేరడంతో పరిసరాలు దుర్వాసన వెదజల్లుతున్నాయి. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇంద్ర నగర్ కాలనీ ఆనుకొని సుమారు గత ఆరు నెలల క్రితం వర్షపు నీరు వెళ్లే కాలువను నిర్మించారు. కాలువ నిర్మించే సమయంలో పక్కనే ఉన్న డ్రైనేజీ పైపులైన్లు పగలగొట్టారు. ఇటు కాంట్రాక్టర్ కానీ అటు మున్సిపల్ అధికారులు కానీ మరమ్మతులు చేయక పోవడంతో పగిలిన డ్రైనేజ్ పైప్లైన్ నుంచి మురుగు నీరు కాలువలోకి చేరుతుంది. పరిసర ప్రాంతవాసులు దుర్వాసన, దోమలతో అనారోగ్యం బారిన పడుతున్నారు. పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

వేడుకగా శివపార్వతుల కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో పాల్గొన్న విజయారెడ్డి

హిమాయత్‌నగర్: హిమాయత్‌నగర్ డివిజన్ గాంధీ కుటీర్‌లోని శ్రీశ్రీశ్రీ భూలక్ష్మి దుర్గాదేవి ఆలయ 27వ వార్షికోత్సవం ఘనంగా జరుగుతోంది. అందులో భాగంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవాన్ని బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి విజయరెడ్డి పాల్గొని శివపార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, బస్తీ వాసులు పాల్గొన్నారు.

కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తాం





ఇంటింటి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మద్దతుగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ బుధవారం కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. కాసానిని అఖండ మెజార్టీతో గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇస్తామన్నారు. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి చేవెళ్ల పార్లమెంట్ స్థానంలో బీఆర్ఎస్ పార్టీ గెలుస్తూ వచ్చిందన్నారు. ఈసారి కూడా తమదే విజయమని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఇద్దరు నేతలకు అవకాశం ఇచ్చిందని ప్రస్తుతం వారు ఇతర పార్టీల నుంచి పోటీ చేస్తున్నారని గుర్తు చేశారు. ఆ ఇద్దరిని ఓడించటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ప్రజల నుంచి వ్యతిరేకత ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. కేసీఆర్‌ని ప్రజలు ఇప్పుడు గుర్తు చేసుకుంటున్నారని తెలిపారు.

భారతీయ మార్కెట్‌లోకి 'లంక స్పెషల్ స్టీల్స్'

- నగరంలో తొలి ఓవర్సీస్ ఆఫీస్ ప్రారంభం
- భారతీయ మార్కెట్‌లోకి పొల్ట్రీ 300, ప్రీమియం 100 గాల్వనైజ్డ్ స్టీల్ వైర్స్

సాక్షి, సిటీబ్యూరో: శ్రీలంకకు చెందిన జీఐ వైర్ ఇండస్ట్రీ దిగ్గజం 'లంక స్పెషల్ స్టీల్స్ లిమిటెడ్ (ఎల్ఎస్ఎస్ఎల్) ఆధ్వర్యంలో నగరం వేదికగా తమ బ్రాండ్‌ను ప్రారంభించింది. ఇందులో భాగంగా రాడిసన్ హోటల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భారతీయ మార్కెట్‌లోకి పొల్ట్రీ 300, ప్రీమియం 100 అనే రెండు ప్రత్యేకమైన గాల్వనైజ్డ్ స్టీల్ వైర్లను ఆవిష్కరించింది. వీటితో పాటు నగరంలో ఏర్పాటు చేసిన సంస్థ తొలి ఓవర్సీస్ ఆఫీస్‌ను ఈటీ క్రిసీ గ్రూప్ చైర్మన్ ఎస్.డి.ఆర్ అరుద్ ప్రగాసం ప్రారంభించారు. ఈ సందర్భంగా అరుద్ ప్రగాసం మాట్లాడుతూ., లంక స్పెషల్ స్టీల్స్ ఒకప్పుడు టాటా స్టీల్ కంపెనీలో భాగం. 2015లో దాన్ని ఈటీ క్రిసీ, కో.పి.ఎల్.సి కొనుగోలు చేసిందని..ప్రస్తుతం ఇది శ్రీలంకలోని టాటా స్టీల్ గ్లోబల్ వైర్ ఇండియాకు ఏకైక ఏజెంట్‌గా, పంపిణీదారుగా కొనసాగుతోందని అన్నారు. లంక స్పెషల్ స్టీల్స్ ఎన్నో ఏళ్లుగా భారత మార్కెట్‌తో అనుబంధాన్ని కలిగి ఉందని సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సంతోష్ డిసిల్వా పేర్కొన్నారు. కార్యక్రమంలో సేలం వెల్డ్ మెష్ ఎండీ నటరాజన్, ఉదయ్ సింగ్ బయాస్, చక్రధర్ రావు, గేయన్ పతినాయక తదితరులు పాల్గొన్నారు.

10.75 లీటర్ల మద్యం పట్టివేత

పటాన్‌చెరు టౌన్: బెల్టు షాప్‌లు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అమీన్‌పూర్ సీఐ నాగరాజు అన్నారు. బుధవారం అమీన్‌పూర్ పరిధిలోని జవహర్‌లాల్ కాలనీలో శ్రీకాంత్‌గౌడ్ అనే వ్యక్తి హోటల్లో మద్యం విక్రయిస్తున్నాడని పోలీసులకు సమాచారం అందడంతో పోలీసులు దాడులు నిర్వహించి 10.75 లీటర్ల మద్యంను స్వాధీనం చేసుకుని నిర్వాహకుడు శ్రీకాంత్ పై కేసు నమోదు చేశారు.

రాగిడి నామినేషన్‌కు గులాబీ దళం

హాజరైన మాజీ మంత్రులు కేటీఆర్, మల్లారెడ్డి



రాగిడి నామినేషన్ ఊరేగింపులో మాజీ మంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీ రాజు

కూకట్‌పల్లి: మల్కాజ్‌గిరి లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి నామినేషన్ ర్యాలీ కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో కొనసాగింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు శంభీపూర్‌రాజు, మాజీ మంత్రి మల్లారెడ్డి, నియోజకవర్గ కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్షులు, నాయకులు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. మల్కాజ్‌గిరి ఎంపీగా రాగిడి లక్ష్మారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని ఎమ్మెల్యే కృష్ణారావు అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి చూసి ప్రజలు రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశఋారు. కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీ వచ్చే విధంగా తన వంతు కృషి చేస్తానన్నారు.

బీఆర్ఎస్ విజయం సాధించేలా కష్టపడాలి: కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్

ఓల్డ్‌బోయిన్‌పల్లి: మల్కాజ్‌గిరి లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి నామినేషన్‌కు ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ నుంచి పెద్ద ఎత్తున నాయకులు తరలి వెళ్లారు. ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ ఆధ్వర్యంలో నాయకులు మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ మాట్లాడుతూ.. మల్కాజ్‌గిరిలో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించేలా మనమందరం కష్టపడి పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. మన బలగాన్ని చూసి కాంగ్రెస్, బీజేపీ నేతలకు వణుకు మొదలు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కర్రె జంగయ్య, మక్కాల నర్సింగ్‌రావు, ఇర్ఫాన్, మేకల హరినాథ్, మక్కాల సత్యనారాయణ, బల్‌రాజు, నాగేష్, పిట్ల రాజ, రాజుగౌడ్, పోచయ్య, కనకదాస్, మట్టిశ్రీను, లలితా, సరోజదేవి, శాలిని, ఉమా తదితరులు పాల్గొన్నారు.



బాలాజీనగర్ కార్పొరేటర్ శిరీష ఆధ్వర్యంలో వెళ్తున్న నాయకులు



ఓల్డ్‌బోయిన్‌పల్లి నుంచి తరలి వెళ్తున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్

రేగులకుంట చెరువుతో ఆహ్లాదం



దీప్తిశ్రీనగర్ కాలనీలోని రేగులకుంట చెరువును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

మియాపూర్: చెరువుల సుందరీకరణతో స్థానిక ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అందుతుందని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తిశ్రీనగర్ కాలనీలో రూ.1.50కోట్లతో సుందరీకరించిన రేగులకుంట చెరువును కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రేగులకుంట చెరువును సుందరీకరణకు ముందుకు వచ్చిన సేల్స్ ఫోర్స్ ఐటీ కంపెనీ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో చందానగర్ డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, ఐటీ సంస్థ ప్రతినిధులు మల్లిగవార్డ్ ఫౌండేషన్ సభ్యులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నాలా పూడికతీతపై జెడ్‌సీ సమీక్ష

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ బుధవారం ఇంజినీరింగ్ అధికారులతో నాలా పూడికతీత పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... నాలాల పూడికతీత పనులు జరిపినా మొదటగా కాలనీ సంక్షేమ సంఘాలకు ఫిర్యాదుల రిజిస్టర్ గురించి తెలియజేయాలని సూచించారు. నాలాల పూడికతీత పనుల్లో అవకతవకలు జరగకుండా చూసేందుకే ఇలా చేస్తున్నామన్నారు. పారదర్శకంగా పనులు జరగడానికి జీహెచ్ఎంసీ వారు ఏర్పాటు చేసిన రిజిస్టర్‌లో స్థానికుల అభిప్రాయాలను నమోదు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ చిన్నారెడ్డి, అన్ని సర్కిళ్ల ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

కాలనీలో చోరీలు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలం ఖాజీపల్లి గ్రామంలోని 181 సర్వేనంబర్‌లోని కాలనీలో చోరీల పరంపర సాగుతోంది. తాళం వేసి ఉన్న ఇళ్లల్లో దొంగతనాలు చేస్తున్నారు. పోలీసులు నిఘా ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఇద్దరు బాలికల అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు బాలికలు అదృశ్యమైన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్‌కి చెందిన ఓ మైనర్ బాలిక(17) మంగళవారం ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదు.దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికిన ఆచూకీ లభించలేదు బాలిక అదృశ్యంపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మరో ఘటనలో మంగళవారం మధ్యాహ్నం బీరంగూడకు చెందిన మైనర్ బాలిక ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు బాలిక అదృశ్యంపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.